- 'చేయి' వదిలి 'కారు' ఎక్కుతున్న ప్రధాన నేతలు
- మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్
- రేవంత్‌పై దేవరకద్ర నాయకుల నిప్పులు
- 'జీఎంఆర్' టికెట్ రద్దు చేయాలని ఆందోళనలు
- బీఆర్ఎస్‌లోకి నాగం జనార్దన్‌రెడ్డి
- వాడిపోయిన 'కమలం' : బీఆర్ఎస్‌లోకి మాజీ మంత్రి చంద్రశేఖర్

# ప్రతిపక్షాలకు ఝలక్


మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మాజీ మంత్రి పి.చంద్రశేఖర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, చిత్రంలో మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్, బీజేపీ పార్టీల పరిస్థితి ఉమ్మడి జిల్లాలో అయోమయంగా మారింది. కాంగ్రెస్ పార్టీలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి టికెట్లను అమ్ముకున్నాడని ఆరోపిస్తూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆ పార్టీలో కాక రేగుతోంది. సీనియర్ నేతలంతా అసమ్మతితో కారెక్కుతున్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గం టికెట్‌పై ఆశలు పెట్టుకున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డిని కాదని రాజకీయబద్ధ శత్రువైన కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి కుమారుడు రాజేశ్‌రెడ్డికి టికెట్ ఇవ్వడంతో మనస్థాపం చెంది ఆ పార్టీకి రాజీనామా చేశారు. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం కే సీఆర్‌ను కలిశారు. సీఎంతో చర్చించిన అనంతరం గులాబీ పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో నాగర్‌కర్నూల్ జిల్లాలో కాంగ్రెస్ అడ్రస్ గల్లంతయ్యే కరుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. పాలమూరులో బీజేపీకి బిక్ షాక్ ఇస్తూ ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి పి.చంద్రశేఖర్ తెలంగాణ భవన్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. జడ్చర్ల కాంగ్రెస్ టికెట్ ఆశించి నిరాశ పడిన మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ సైతం ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రిని కలిసి భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. దేవరకద్ర టికెట్ బీసీ అయిన ప్రదీప్‌కుమార్‌గౌడ్‌కు ఇవ్వకపోవడంతో కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తామని శపథం చేస్తున్నారు. వనపర్తి టికెట్ ఆశించి భంగపడ్డ మేఘారెడ్డి తన మద్దతుదారులతో సమావేశమయ్యారు. పార్టీ టికెట్లు పునరాలోచించి మార్చకపోతే ఇండిపెండెంట్‌గా పోటీ చేసి సత్తా చూపిస్తానని అధిష్టానానికి అల్టిమేట్ జారీ చేశారు. టికెట్ వస్తుందని చివరి నిమిషం వరకు భావించిన నేతలకు మొండి చేయి చూపడంతో కాంగ్రెస్ పార్టీపై దుమ్మెత్తి పోస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ల కుంభకోణంపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడుతున్నారు. పార్టీని నమ్ముకున్న చాలామంది నేతల భవిష్యత్తు అయోమయంలో పడిపోయింది. కాగా, ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న పరిణామాలతో పాలమూరు పాలిటిక్స్ హీటెక్కాయి. మరికొంత మంది బడా నేతలు బీఆర్ఎస్ వైపు చూస్తుండడంతో ఉమ్మడి జిల్లాలో మళ్లీ క్లీన్ స్వీప్ చేసే దిశగా కారు దూసుకుపోతున్నది.

### కందనూలులో నాగంకు కాంగ్రెస్ మొండి'చేయి'..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎమ్మెల్యేగా, మంత్రిగా చాలాకాలం పాటు పనిచేసిన నాగం జనార్దన్‌రెడ్డికి కాంగ్రెస్ టికెట్ నిరాకరించడంతో ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సీనియర్ నాయకుడిగా దశాబ్దాల పాటు రాజకీయ అనుభవం కలిగిన నాగంకు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి టికెట్ ఇవ్వకుండా కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి కుమారుడు రాజేశ్‌రెడ్డికి ఇవ్వడంతో తీవ్ర మనస్థాపం చెందారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్‌ను కలిసి గులాబీ గూటికి చేరారు.

### వనపర్తిలో ఇండిపెండెంట్‌గా బరిలోకి..

వనపర్తి నియోజకవర్గ టికెట్ ఆశించి భంగపడ్డ మేఘారెడ్డి ఇంకా షాక్‌లోనే ఉన్నారు. ఢిల్లీలో షీల్డ్ కవర్‌లో పేరు పంపిస్తున్నామని చెప్పి కాంగ్రెస్ పార్టీ నేతలు చివరకు మాజీ మంత్రి చిన్నారెడ్డికి టికెట్ కేటాయించారు. దీంతో ఆయన కంగుతిన్నారు. పార్టీపై తిరుగుబాటును ప్రకటించారు. ఆదివారం మేఘారెడ్డి మద్దతుదారులు వనపర్తిలో సమావేశమై టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధిష్టానం మాజీ మంత్రి చిన్నారెడ్డికి టికెట్ ఇచ్చే విషయంలో పునరాలోచించాలని, లేదంటే ఇండిపెండెంట్‌గా పోటీచేసి పార్టీని ఓడగొడుతామని శపథం చేశారు.

### గులాబీ గూటికి అన్నదమ్ములు..

మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్, బీజేపీలకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. బీసీ సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే ఆయా పార్టీలు టికెట్ కేటాయించకపోవడంతో రాజీనామా చేశారు. మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.. మహబూబ్‌నగర్‌లో బీజేపీ నుంచి టికెట్ ఆశించిన మాజీమంత్రి పి.చంద్రశేఖర్‌ను కాదని రాజకీయ అనుభవం లేని మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డికి టికెట్ కేటాయించడంతో తీవ్ర మనస్థాపం చెందారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ బండ ప్రకాశ్ చంద్రశేఖర్‌ను బీఆర్ఎస్‌లోకి రావాలని ఆహ్వానం పలుకడంతో తెలంగాణ భవన్‌లో మంత్రి కేసీఆర్ సమక్షంలో గులాబీ పార్టీలో చేరారు. పి.చంద్రశేఖర్‌కు తమ్ముడి వరుసైన జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ కూడా జడ్చర్ల కాంగ్రెస్ టికెట్ ఆశించారు. ఇస్తామని చెప్పి పార్టీలో చేర్చుకొని చివరికి రేవంత్ రెడ్డి ఓ వ్యాపారవేత్తకు టికెట్ అమ్ముకొని మొండిచేయి చూపారు. దీంతో మనస్థాపం చెంది అనుచరులతో సమావేశమై కాంగ్రెస్‌కు ఎర్రశేఖర్ రాజీనామా చేశారు. దీంతో నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఎర్రశేఖర్‌ను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. మంత్రి కేటీఆర్ సమక్షంలో ఎర్రశేఖర్ గులాబీ కండువా కప్పుకొని అనంతరం సీఎం కేసీఆర్‌ను కలిశారు. బీసీ వర్గాల్లో మంచి పట్టున్న అన్నదమ్ములు ఇద్దరూ బీఆర్ఎస్‌లో చేరడంతో మహబూబ్‌నగర్ జిల్లా రాజకీయాలు మలుపు తిరిగాయి. ఇద్దరి చేరికతో బీఆర్ఎస్‌కు బలం మరింత పెరిగింది. నారాయణపేట జిల్లాలో కూడా వీరిద్దరి ప్రభావం ఉంటుందని విశ్లేషకులు అంటున్నారు.

### దేవరకద్రలో ఇంకా చల్లారని అసమ్మతి..

దేవరకద్ర నియోజకవర్గ టికెట్‌పై ఇంకా రచ్చ జరుగుతూనే ఉంది. బీసీ నేతలను కాదని పార్టీ టికెట్ డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డికి ఇవ్వడంతో తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. మండలాల వారీగా పార్టీ సమావేశాలు నిర్వహించి బీసీ నేత ప్రదీప్‌కుమార్ గౌడ్‌కు టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పార్టీ అభ్యర్థిని మార్చకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి సత్తా చాటుతామని హెచ్చరిక జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ల జాబితాపై తీవ్ర గందరగోళం నెలకొనడంతో ఎక్కడ చూసినా తిరుగుబాటు మొదలైంది. పార్టీపై ఎన్నో ఆశలు పెట్టుకున్న నేతలంతా తమ భవిష్యత్ కార్యాచరణపై తర్జనభజన పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా బీఆర్ఎస్ పార్టీ వైపు చూస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ నుంచి బడా నేతలంతా అయోమయ పరిస్థితితో పాలమూరు పాలిటిక్స్ కీలకంగా మారాయి.

## కాంగ్రెస్‌కు నాగం రాజీనామా

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకుడు నాగం జనార్దన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ఝలక్ ఇచ్చారు. అసెంబ్లీ టికెట్ ఆశించగా ప్యారచూట్ లీడర్లకు ప్రాధాన్యం ఇవ్వడంతో భగ్గుమన్న నాగం ఆ పార్టీకి రాజీనామా చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పెద్ద ఎదురు దెబ్బ కాగా నాగర్‌కర్నూల్ నియోజకవర్గంతో పాటు పాలమూరులో బీఆర్ఎస్ బలం పుంజుకోనున్నది. ఉమ్మడి జిల్లాలో సీనియర్ రాజకీయ నాయకుడైన నాగం నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నుంచి ఏడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. ఉమ్మడి రాష్ట్రంలో బలమైన రాజకీయ నేతగా పలు కీలక మంత్రిత్వ శాఖలను నిర్వహించారు. దీంతో నాగంకు రాష్ట్రంతో పాటుగా ఉమ్మడి పాలమూరులోనూ గణనీయమైన ప్రాబల్యం ఉంది. ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి పదవి కోసం తన కొడుకు రాజేశ్‌రెడ్డికి కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది. దీంతో ఏఐసీసీ అధినాయకుడు రాహూల్‌గాంధీ, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, జానారెడ్డి తదితరుల దృష్టికి విషయం తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు తన రాజీనామా లేఖను పంపించారు. డబ్బులకు టికెట్లు అమ్ముకోవడం అంశాలను ఎండగట్టారు.

అయినా ఎలాంటి ఫలి తం లేకపోవడంతో నాగం జనార్దన్‌రెడ్డి మంత్రు లు కేటీఆర్, హరీశ్‌రావు, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యం లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. త్వరలో ముహూర్తం ఖరారు చేసుకొని బీఆర్ఎస్‌లో చేరనున్నారు. నాగం నిర్ణయంతో నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఆయన అనుచరులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిన మాజీ మంత్రి చంద్రశేఖర్

మహబూబ్‌నగర్, అక్టోబర్ 29 : ప్రజలకు మంచి చేయడం మరిచి కేవలం రాజకీయ పబ్బం గడుపుకొనేందుకు కాంగ్రెస్, బీజేపీలు ప్రయత్నిస్తున్నాయని మాజీ మంత్రి పి.చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎంపీ బండప్రకాశ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి మాజీ మంత్రి పి.చంద్రశేఖర్ మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను మరింత అభివృద్ధి చేసుకునేందుకు సీఎం కేసీఆర్ వెంట నడుస్తామన్నారు. బీజేపీతో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, అభివృద్ధికి పాటుపడుతున్న బీఆర్ఎస్‌కు అండగా నిలిచేందుకు గులాబీ పార్టీలో చేరామన్నారు. అనంతరం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ ప్రధాన మంత్రి ఉండి కూడా బీసీ మంత్రిత్వ శాఖ కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. తెలంగాణలో బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని ఓట్ల కోసం గొప్పలు చెప్పడం సిగ్గుచేటన్నారు.

## 'హస్తం'కు బిగ్‌షాక్

- మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్

జడ్చర్ల టౌన్, అక్టోబర్ 29 : జడ్చర్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి బిగ్‌షాక్ తగిలింది. జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించి భంగపడ్డ మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ ఆదివారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఆ తర్వాత సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మూడు పర్యాయాలు జడ్చర్ల ఎమ్మెల్యేగా పనిచేసిన బీసీ సామాజిక వర్గానికి చెందిన కీలకనేత ఎర్రశేఖర్ బీఆర్ఎస్ పార్టీలో చేరడంతో బీఆర్ఎస్ పార్టీకి మరింత బలం చేకూరనుంది.

## కాంగ్రెస్‌లో కలవరం


అడ్డాకులలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మూసాపేట(అడ్డాకుల), అక్టోబర్ 29 : కాంగ్రెస్ పార్టీ దేవరకద్ర ఎమ్మెల్యే అభ్యర్థి మధుసూదన్‌రెడ్డికి ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. అడ్డాకుల మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్డాకుల మండల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోవుల బాలరాజు, సీనియర్ నాయకుడు ఖాజామైనొద్దీన్, ఓబీసీ మండల అధ్యక్షుడు కొ త్తశ్రీను, హన్మంతులు స్థానిక నాయకులు, కా ర్యకర్తలతో కలిసి విలేకరులతో మాట్లాడారు.

### అభ్యర్థిని మార్చాలి

భూత్పూర్, అక్టోబర్ 29 : దేవరకద్ర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డిని మార్చాలని డీసీసీ నాయకుడు గోవర్ధన్‌గౌడ్ కోరారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ముందు నుంచి వెన్నుదన్నుగా ఉండి కష్టకాలంలో ఆదుకున్న నాయకులు నియోజకవర్గంలో ఎంతో మంది ఉన్నారన్నారు. వీరిని కాదని నాలుగేండ్ల కిందట కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి 3,4నెలలుగా నియోజకవర్గంలో తిరిగితే మధుసూదన్‌రెడ్డిని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అభ్యర్థిగా ప్రకటించడం సరికాదన్నారు. నియోజకవర్గంలో ఒక్క సీనియర్ నాయకుడిని, కార్యకర్తను సైతం కలవని వ్యక్తిని ఎలా అభ్యర్థిగా ప్రకటిస్తారని ప్రశ్నించారు. అభ్యర్థిని మార్చకపోతే పార్టీ తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందన్నారు.

### కొత్తకోటలో నిరసన జ్వాలలు..

కొత్తకోట, అక్టోబర్ 29 : పట్టణంలోని కాంగ్రెస్ యూత్ నాయకుల ఆధ్వర్యంలో మధుసూదన్‌రెడ్డి అభ్యర్థిగా వ్యతిరేకిస్తూ ర్యాలీ నిర్వహించి చౌరస్తాలో నిరసన తెలిపారు. యూత్ అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ మాట్లాడుతూ సొంత పార్టీ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించిన వ్యక్తి మధుసూదన్‌రెడ్డి అని మండిపడ్డారు.

### నమ్ముకున్నోళ్లను నట్టేట ముంచిన కాంగ్రెస్..

మదనాపురం, అక్టోబర్ 29 : కాంగ్రెస్ అధిష్టానం నట్టేట ముంచిందని ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు రాఘవేంద్ర అన్నారు. బీసీ అభ్యర్థి అయిన కాటం ప్రదీప్‌కుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీకి 30ఏళ్లుగా సేవ చేస్తున్నారని, ఆయనను కాదని మధుసూదన్‌రెడ్డికి టికెట్ ఇవ్వడం సరికాదన్నారు.

## అధిష్టానం పునరాలోచించాలి

- చిన్నారెడ్డికి టికెట్ ఇవ్వడంపై ఎంపీపీ మేఘారెడ్డి ఫైర్

వనపర్తి, అక్టోబర్ 29 : కాంగ్రెస్ పార్టీ వనపర్తి నియోజకవర్గ టికెట్ చిన్నారెడ్డికి ఇవ్వడాన్ని పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి ఖండించారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో తన వర్గీయులతో సమావేశమయ్యారు. ప్రజా సర్వేలో ఎవరు ముందుంటే వారికి అధిష్టానం టికెట్ ఇవ్వాలే తప్పా చిన్నారెడ్డికి ఇవ్వడం సరికాదన్నారు. చిన్నారెడ్డి అధిష్టానం పెద్దల కాళ్లు మొక్కితే టికెట్ ఇస్తే, టికెట్ రద్దు చేయమని తాము కూడా 50వేల మందితో ఢిల్లీకి వెళ్లి అందరి కాళ్లు మొక్కుతామని ఘాటుగా స్పందించారు. అధిష్టానం ఇకనైనా నిర్ణయం మార్చుకోవాలన్నారు. లేదంటే ఇబ్బందులు తప్పవన్నారు.